



మితిమీరుతున్న ఆగడాలు



మన్నూర్‌లో సీజ్ చేసిన ఆర్ఎంపీ వైద్యుడి క్లినిక్

గుర్జలో పారవేసిన శిశువు మృతదేహం

- జిల్లాలో వచ్చీరాని వైద్యంతో రెచ్చిపోతున్న ఆర్ఎంపీలు
- గుడిహత్నూర్ మండలం గుర్జవాగులో మృత శిశువు కలకలం
- మన్నూర్ గ్రామానికి చెందిన ఓ ఆర్ఎంపీ వైద్యుడి అరెస్టు
- ఏజెన్సీ ప్రాంతంలో యథేచ్ఛగా సాగుతున్న అడ్డగోలు దందా
- కట్టడి చేయడంలో విఫలమవుతున్న అధికార యంత్రాంగం

ఆదిలాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఆర్ఎంపీ వైద్యుల ఆగడాలు మితిమీరుతున్నాయి. మానవ విలువలను మరిచిపోయి డబ్బు కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. బాధితుల అమాయకత్వం అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న కొంత మంది ఆర్ఎంపీలు అడ్డగోలు దందాలకు ఎగబడుతున్నారు. పరిమితికి మించి వైద్యం చేస్తూ కటకటాల పాలవుతున్నారు. కొండ నాలికకు మందు ఇస్తే ఉన్న నాలుక ఊడి పోయిన చందంగా ఆర్ఎంపీల వైద్యం కనిపిస్తోంది. ఎంతో కొంత వైద్య వృత్తిలో అనుభవం ఉన్న వారంతా ఆర్ఎంపీ వైద్యులుగా అవతారమెత్తి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇటీవల గుడిహత్నూర్ మండలం గుర్జా వాగులో మృత శిశువును పారవేసిన ఘటన జిల్లాలో కలకలం రేపుతుంది. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా అసలు విషయం బయట పడింది. ఓ మైనర్ బాలిక గర్భందాల్చడంతో మన్నూరు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు అబార్షన్ చేసి గుర్జవాగులో మృత శిశువును పారవేసినట్లు గుర్తించారు. దీంతో ఆర్ఎంపీ వైద్యున్ని అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు పంపించారు. గతంలోను ఇచ్చోడ మండల కేంద్రంలోని ఆర్ఎంపీ వైద్యుడు ఇదే తరహాలో గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా అబార్షన్ చేసి జైలు పాలైన దాఖలాలు ఉన్నాయి. అలాగే తాంసి మండలంలోని గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన యువకుడికి ఆర్ఎంపీ డాక్టర్ వైద్యం చేయడంతో ఆ యువకుడి ప్రాణాలు గాలిలో కలిశాయి. దీనిని మరిచి పోకముందే గుడిహత్నూర్ మండలంలో మరోఘటన చోటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. బేల మండల కేంద్రంలోను ఓ ఆర్ఎంపీ వైద్యుడి వ్యవహారంపై కూడా తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, బోథ్, సిరికొండ, ఇచ్చోడ, బేల, తాంసి, తలమడుగు మండలాల్లోని మారుమూల గ్రామాల్లో ఇలాంటి సంఘటనలు తరచూ వెలుగు చూస్తునే ఉన్నాయి. వైద్య ఆరోగ్యశాఖాధికారులు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఆర్ఎంపీ దందాల పై దర్యాప్తు జరిపితే మరికొంత మంది ఆర్ఎంపీ వైద్యుల అసలు బాగోతం బయటపడే అవకాశం ఉందంటున్నారు.

పిండాన్ని పిండేస్తున్నారు

జిల్లాలో ఆర్ఎంపీలకు డబ్బులిస్తే దేనికైనా సిద్ధమవుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్‌లు చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. ఏదైనా అత్యవసర, ప్రమాదకర పరిస్థితుల్లోనే డాక్టర్ సలహా మేరకు అబార్షన్ చేయాల్సి ఉంటుంది. కానీ అక్రమంగా గర్భందాల్చిన దానిని విచ్ఛిత్తి చేసేందుకు కొందరు ఆర్ఎంపీ వైద్యులు వెనుకాడడం లేదు. ఇదంతా రహస్యమే అయినప్పటికీ కొన్ని ఘటనలు మాత్రం వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో గ్రామస్థాయిలో పెద్దల సమక్షంలో సెటిల్ చేస్తూ చేతులు దలుపుకుంటున్నారు. విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. అయితే గుర్జ మృతశిశువు ఘటనలో రూ.5 నుంచి రూ.10వేలను తీసుకొని అబార్షన్ చేసినట్లు తెలుస్తోంది. కొన్ని సందర్భాల్లో తల్లిప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పరిమితులకు మించి ఆర్ఎంపీలు వైద్యం చేయరాదంటూ ఎన్నిసార్లు హెచ్చరించినా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. కాసులకు కక్కుర్తి పడి నిండు ప్రాణాలను బలితీసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్

అక్రమంగా అబార్షన్‌కు పాల్పడిన మన్నూర్ ఆర్ఎంపీ వైద్యుడి క్లీనిక్‌ను అధికారులు ఇప్పటికే సీజ్ చేశారు. ఏదైనా జరుగకూడని సంఘటన జరిగితేనే వైద్య ఆరోగ్యశాఖాధికారులు హడావిడి చేస్తున్న, ఆ తర్వాత అంతా మాములుగానే మారిపోతుందన్న విమర్శలు వస్తున్నాయి. గత రెండు రోజుల క్రితమే ఆర్ఎంపీ వైద్యున్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు శనివారం రిమాండ్‌కు పంపించినట్లు తెలుస్తోంది. అయితే యువతిని నమ్మించి మోసం చేసిన వారు ఎవరన్నది అంతుచిక్కడం లేదు. దీనంతటికి కారకులైనా యువకుడిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. అమాయక యువతిని మోసగించి ప్రాణాలతో చెలగాటమాడిన యువకుడి వివరాలను వెల్లడించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్ఎంపీ వైద్యున్ని అరెస్టు చేసి జైలుకు పంపిన అధికారులు అసలు సూత్రధారుడైన యువకుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అమాయక గిరిజనులే టార్గెట్

ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో అమాయక గిరిజనులను టార్గెట్ చేస్తున్న ఆర్ఎంపీలు అడ్డగోలు దందాలకు ఎగబడుతున్నారు. అక్రమ అబార్షన్‌లతో పాటు అడ్డగోలుగా వైద్యం చేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గతంలో ఆర్ఎంపీల వైద్యం వికటించి పలువురు అస్వస్థతకు గురికావడంతో పాటు ప్రాణాలు పోయిన దాఖలాలు ఉన్నాయి. అమాయక యువతులను మోసం చేస్తున్న కొందరు యువకులు ఆర్ఎంపీలను ఆశ్రయిస్తూ గుట్టుచప్పుడుకాకుండా అబార్షన్ చేయిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఇదే అదునుగా ఆర్ఎంపీలు అడ్డగోలుగా దండుకుంటు అక్రమ సంపాదనకు ఎగబడుతున్నారు. ఏదో చలిజ్వరం, దగ్గు జలుబు, కడుపునొప్పి లాంటి చిన్నచిన్న వ్యాధులకు సూదిమందు ఇచ్చే ఆర్ఎంపీ, కంపౌండర్లు బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తూ అవసరం లేకున్నా శస్త్రచికిత్సలు చేసేస్తున్నారు. మోకాళ్ల నొప్పులకు అత్యంత శక్తివంతమైన స్టెరాయిడ్ ఇంజక్షన్‌లను ఇవ్వడంతో వైద్యం వికటించి బాధితులు మంచం పడుతున్నారు. అలాగే మోకాళ్ల చుట్టూ వాతలు పెట్టడంతో నడవలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పలువురు ఆర్ఎంపీలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపినా మళ్లీ అవే సంఘటనలు పునరావృతమవుతున్నాయి. ఆర్ఎంపీ వైద్యుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్లు వస్తున్నా కట్టడి చేయడంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేశాం

- డాక్టర్ నరేందర్‌రాథోడ్, డీఎంహెచ్‌వో



పరిమితికి మించి వైద్యం చేసిన మన్నూరు ఆర్ఎంపీ వైద్యుడి క్లినిక్‌ను సీజ్ చేశాం. అబార్షన్, శస్త్ర చికిత్స చేయడానికి ఆయనకు ఎలాంటి అర్హత లేదు. పోలీసుల సమాచారంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించి క్లినిక్‌ను సీజ్ చేశాం. ప్రస్తుతం దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జిల్లాలో మరికొంత మంది వైద్యులపై వస్తున్న ఆరోపణలను పరిశీలిస్తున్నాం. నిబంధనల ప్రకారం వ్యవహరించని ఆర్ఎంపీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ఆర్ఎంపీ వైద్యుడిని రిమాండ్ చేశాం

- కాజల్‌సింగ్, ఏఎస్పీ, ఉట్నూర్



గుడిహత్నూర్ మండలం గుర్జ మృత శిశువు ఘటనపై దర్యాప్తు చేస్తున్నాం. అబార్షన్‌కు పాల్పడిన మన్నూరు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు సూర్యవంశీ దిలీప్‌ను అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించాం. 5 మాసాల గర్భవతికి అర్హతకు మించి వైద్యం చేసి అబార్షన్ చేయడంతో పాటు అస్వస్థతకు గురి చేసిన వైద్యుడిపై చర్యలు తీసుకున్నాం. వైద్యుడిపై ఎంపీటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశాం. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కేసులు తప్పవు.

ఆదివాసీల ఆందోళన ఉద్రిక్తం

- నినాదాలతో దద్దరిల్లిన కలెక్టరేట్
- మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్



ఆదివాసీలతో మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట శనివారం ఆదివాసులు చేపట్టిన ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. కలెక్టరేట్ కార్యాలయంలో లోపలికి చొచ్చుకెళ్లడానికి ప్రయత్నించిన ఆదివాసీలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. ఆదివాసీ నినాదాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. వివరాలు.. ఆదిలాబాద్ పట్టణంలోని సర్వేనంబర్ 72లోని కొమురం భీం కాలనీలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న ఆదివాసులకు పట్టాలతో పాటు మౌలిక వస తులు కల్పించాలని కలెక్టర్ ఆదివాసుల శనివారం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రధాన గేటు ఎదుట బైఠాయించి సౌకర్యాలు కల్పిం చాలని నినాదాలు చేశారు. ఓ సమయంలో కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లే యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. కొంత సేపు వీరి మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఆర్డీఓ వినోద్ కుమార్, రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడే యత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. సౌకర్యాలు కల్పించే వరకు తాము ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. కరెంట్ సౌకర్యం కల్పనకు సీఎండీకి లేఖ ఇస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించినట్లు గోడం గణేష్ తెలిపారు.

- **కోట్ల విలువైన భూమి కాజేసేందుకు యత్నం..**

ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర కో-కన్వీనర్ గోడం గణేష్ మాట్లాడుతూ.. ఏండ్ల క్రితం ఆదివాసులు తమ పిల్లల చదువుల కోసం ప్రభుత్వ భూమి అయిన 170 లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని తెలిపారు. సౌకర్యాలు కల్పించకపోయిన చరిత్రలో ఎక్కడ లేని విధంగా చందాలు వేసుకొని కరెంట్ పోల్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. కానీ విద్యుత్ అధికారులు వాటిని కట్ చేశారని ఆరోపించారు. అదే విధంగా మిషన్‌భగీరథ నీటిని కట్ చేయడంతో డీఎస్పీ జీవన్ రెడ్డి చొరవతో నీరు వస్తుందన్నారు. ఆదివాసులు అన్నింట్లో ఎదగాలని చెబుతున్న అధికారులు, ప్రభుత్వం వారికి నీడను కూడా కల్పించడం లేదని మండిపడ్డారు. కోట్ల విలువ భూమి రియల్టర్లు, ప్రజాప్రతినిధులు కాజేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అందుకే సర్వే 72 నుంచి ఎలాగైన ఆదివాసులను ఖాళీ చేయాలని కుట్రలు చేస్తున్నారన్నారు. అడవిలో ఉంటే టైగర్ జోన్ పేరిట వెళ్లగొడుతున్నారన్నారు. పట్టణంలో పిల్లల చదువు కోసం ఉంటే కోట్ల విలువైన భూమి అని, కోర్టు కేసులున్నాయని అధికారులు, ప్రభుత్వం చెప్పడం సరికాదని వాపోయారు. ఆదివాసులుగా పుట్టడం తాము చేసిన తప్పా అని ప్రశ్నించారు. ఆదివాసులకు న్యాయం చేయడంతో పాటు పట్టాలు, మౌలిక వసతులైన కరెంట్, తాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు మనోజ్, గేడం రేణుక, ఉయిక ఇందిర, సోయం లలిత, సలాం వరుణ్, మెస్రం నాగనాథ్, పెందుర్ సంతోష్, అనసుయ బాయి, దుర్వ జుగాది రావ్ పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కబ్జా చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు

నార్నూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 57 వద్ద రెండు ఎకరాల స్థలంలో శ్మశానవాటిక స్థలం కబ్జా చేశారని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌కు ఆదివాసీ సంక్షేమ పరిషత్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి అర్క గోవింద్ శనివారం మండల కేంద్రం మీడియా సమావేశంలో మాట్లాడుతూ శ్మశానవాటిక కబ్జా అవుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రెండు ఎకరాల భూమి ఎక్కడ ఉందో ఆదివాసీ ప్రజలకు చూయించాలని డిమాండ్ చేశారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోకపోతే పోరాటం చేస్తామన్నారను. వారి వెంట నాయకులు మెస్రం హీరాలాల్, పుసం బాపురావు, కినక ప్రభావత్ రావు, సెద్మకి వినోద్ ఉన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు



అరెస్ట్ అయిన మట్కానిర్వాహకులతో పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో మట్కా నిర్వహించినా, జూదం, పేకాట ఆడినా ఇల్లు సీజ్ అవుతుందని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి హెచ్చరించారు. వివరాలు.. శనివారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రణదివ్య నగర్‌కు సంబంధించిన వ్యక్తి ప్రవీణ్, లఖనర్, పుస్తక్ శివ, చందన్ కేడి ఆకాష్‌పై మట్కా కేసు నమోదు అయిందని డీఎస్పీ అన్నారు. వారి వద్ద నుంచి రూ.10,200, పెద్దఎత్తున మట్కా చీటిలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఓనర్లు అద్దెకి ఇచ్చే ముందు కిరాయిదారులు ఏం చేస్తున్నారనే విషయాన్ని తెలుసుకోవాలని తెలిపారు. ఒకవేళ కిరాయిదారులు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఇల్లును రెవెన్యూ అధికారులు జప్తు చేస్తారన్నారు.

నేషనల్ మార్ట్‌లో చోరీ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నేషనల్ మార్ట్‌లో ఓ వ్యక్తి చొరబడి చోరీకి పాల్పడ్డాడు. లోపల లాకర్‌ను పగలగొట్టి రూ.4.82 లక్షల నగదును దొంగలించినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఆ దొంగలించిన వ్యక్తి ఫొటోలు సీసీ కెమెరాకు చిక్కాయి. కాగా ప్రజలు ఇతన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. అతన్ని పట్టించిన వారికి తగిన రివార్డు అందజేస్తామని రూరల్ పోలీసులు పేర్కొన్నారు. సమాచారం తెలిసిన వెంటనే ఈ కింది నెంబర్లకు ఎస్‌డీపీఓ సెల్ : 8712659914, 9949083333, రూరల్ సీఐ సెల్ : 8712659915 సమాచారం అందించాలని కోరారు.


పోలీసుల అదుపులో బీఆర్ఎస్వీ నాయకులు



ఉట్నూర్ పోలీసుల అదుపులో ఉన్న బీఆర్ఎస్వీ నాయకులు

ఉట్నూర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్రమైన అన్యాయం చేసిందని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేశ్ ఆరోపించారు. బీఆర్ఎస్వీ ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి పిలుపు మేరకు ఉట్నూర్ పోలీసులు బీఆర్ఎస్‌వీ జిల్ల అధ్యక్షుడు ధరణి రాజేష్, మరో నాయకుడుభూమన్నలను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ధరణి రాజేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పూనుకోవడం అప్రజాస్వామికం అన్నారు. ఇప్పటికే ఈ రాష్ట్రంలో దాదాపు 8000 కోట్లు విద్యార్థులకు రావాల్సిన బకాయిల వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం : ఆడే గజేందర్



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆడేగజేందర్

నేరడిగొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బీసీలకు 12 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు శాసనసభ ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం నేరడిగొండ మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పెద్దఎత్తున బాణాసంచ కాల్చారు. ఈ సందర్భంగా ఆడేగజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, నారాయణసింగ్, కైలాష్‌సింగ్, కమల్‌సింగ్, వకీల్, మహేందర్, బద్దం పోతారెడ్డి, సద్దాం శంకర్, రూప్‌సింగ్, ఆడేరమేష్, నారాయణరెడ్డి, సుభాష్, కేవల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

టైగర్‌జోన్ సాకుతో అభివృద్ధికి అడ్డంకులు

- ప్రభుత్వం నిధులు ఇస్తున్నా అటవీ అధికారులు సహకరించడం లేదు
- అసెంబ్లీలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉట్నూర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్‌జోన్‌లో పులులు ఉన్నాయో లేదో తెలియదు కాని అటవీ శాఖ అధికారులు మాత్రం ఆదివాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. శనివారం అసెంబ్లీ జీరో అవర్స్‌లో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వెనుకబడిన జిల్లా అని, తన ఖానాపూర్ నియోజక వర్గం ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలో వస్తుందన్నారు. కవ్వాల్ టైగర్‌జోన్ పేరుతో అటవీ శాఖ అధికారులు అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారన్నారు. దస్తురాబాద్ మండలం దేవునిగూడెంలో పొచమ్మ ఆలయం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా నిర్మాణాన్ని అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని అన్నారు. వాయిపేట్, కడెం మండలం గంగాపూర్, మొర్రిగూడ ప్రాంతంలో త్రీఫేస్ కరెంట్ సౌకర్యం కల్పించకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. కవ్వాల్ టైగర్‌జోన్ సాకుతో ఒకవైపు ప్రభుత్వం నిధులు ఇస్తుంటే మరోవైపు అధికారులు అడ్డుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ మంచిర్యాల నిర్మల్ జిల్లాల అటవీ శాఖ అధికారులకు అభివృద్ధి పనులను అడ్డుకోకుండా ఆదేశాలు జారీ చేయాలన్నారు. సిమెంట్ రోడ్లనిర్మాణం కోసం సమీపంలో ఉన్న వాగుల నుంచి ఇసుక సేకరించకుండా అడ్డుకుంటున్నారన్నారు. అలాగే పనిచేస్తున్నగెస్ట్ లెక్చరర్‌లను రెన్యూవల్ చేసి కొనసాగించాలని ఎమ్మెల్యే కోరారు. ఎస్సారెస్పీ విషయం మాట్లాడడానికి ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ప్రయత్నించగా స్పీకర్ మైక్ కట్ చేశారు.

విద్యతోనే భవిష్యత్తు

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్‌లో నిర్మాణ్, సర్వీస్‌నౌ సంస్థ దత్తత తీసుకున్న గ్రామాన్ని శనివారం కలెక్టర్ రాజర్షిషా సందర్శించి, లబ్ధిదారులకు లైవ్‌వుడ్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ్, సర్వీస్‌నౌ సంస్థ దత్తత తీసుకొని గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతున్నారని అభినందించారు. గ్రామంలో మౌలిక వసతులతోపాటు విద్య, వైద్యం, ఆర్థికంగా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని, ఆ సంస్థ నుంచి వచ్చిన 20 మంది గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఈ సంస్థ 5 సంవత్సరాల నుంచి సేవలు అందిస్తున్నారని అన్నారు. దిశ మోడల్ స్కూల్ ద్వార నాణ్యమైన విద్యను విద్యార్థులకు, విద్యార్థులు మంచిగా చదువుకొని భావితరాలకు ఆదర్శంగా నిలవాలని, గ్రామాల నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలని కోరారు. అనంతరం ఐరన్‌తో చేసిన ఎడ్ల బండ్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం పదోతరగతి పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా ఆదిలాబాద్ పట్టణంలోని లిటిల్‌స్టార్ పాఠశాల, తర్వాత ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ జిల్లా పరిషత్ పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, ఇతర వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం అధికారులకు సూచనలు చేశారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



ఇచ్చోడలో కేసుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

ఇచ్చోడ, మార్చి, 22, (ఆంధ్రజ్యోతి) : రహదారులపై రోడ్డుప్రమాదాలను పూర్తిగా ఆరికట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని సర్కిల్, పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం పోలీసులు గౌరవవందనాన్ని స్వీకరించి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాబాలలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, మద్యం సేవించడం లాంటి వాటిని ఉపేక్షించకుండా నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. డ్రంక్‌అండ్‌డ్రైవ్ టెస్టులు రోజు వారి నిర్వహించాలన్నారు. ఆదివాసీ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ గంజాయి వల్ల ప్రభుత్వ పథకాలను నష్టపోతారనే విషయాన్ని చెబుతూ చైతన్యపరచాలన్నారు. స్టేషన్ పరిధిలో రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తు ఎలాంటి పెండింగ్‌లు లేకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, ఇచ్చోడ సర్కిల్ సీఐ భీమేష్, ఎస్సై తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండ పోలీస్‌స్టేషన్ తనిఖీ

సిరికొండ : మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఎస్సై శివరాం ఎస్పీకి పూల మొక్క అందజేసి స్వాగతం పలికి సిబ్బందిని పరిచయం చేశారు. అనంతరం స్టేషన్ రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్‌బ్యారక్, టెక్నికల్‌రూమ్‌లను పరిశీలించారు. తదుపరి పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ...స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం వేళల్లో విధిగా పోలీసు సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎస్సైకి సూచించారు. ఆయన వెంట ఏఎస్పీ కాజల్‌సింగ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- **నేరడిగొండ పోలీస్‌స్టేషన్ తనిఖీ**

నేరడిగొండ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. శనివారం నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ అరికట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు. జాతీయ రహదారుల వెంట గల దాబాహోటల్లో అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం ఇవ్వకుండా పూర్తిగా రూపుమాపాలని ఎస్పీ అఖిల్ అఖిల్ మహజన్ తెలిపారు. అనంతరం దాబా హోటల్‌ను ఆయన తనిఖీ చేశారు. దాబా హోటల్లో నిర్వహణ సరిగా లేకపోవడంతో పాటు బహిరంగంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలపడంతో నిర్వాహకుడు గోపిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఉట్నూర్ కాజల్ సింగ్, ఇచ్చోడ సిఐ భీమేష్, ఎస్సై శ్రీకాంత్. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులు తమ సంతానానికి బహూకరించే వాటన్నింటిలోను శ్రేష్టమైన, ఉత్తమమైన కానుకల్లో ఉత్తమైనది చదువు సంస్కారాలే.

సోలాపూర్ మార్కెట్‌యార్డును సందర్శించిన సభ్యులు



సోలాపూర్‌లో ఉల్లిగడ్డ అమ్మకంపై అధ్యయనం చేస్తున్న సభ్యులు

ఇంద్రవెల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తమ్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర మార్కెట్ కమిటీలో కొనుగోలు పంటల ధరలపై నిర్వహిస్తున్న అమ్మకంపై అధ్యయనం చేశారు. సోలాపూర్ బజార్ సమితి అధికారులతో మాట్లాడి వ్యవసాయ మార్కెట్ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి రైతులు పండించిన ఉల్లిగడ్డల అమ్మకాలపై జరుగుతున్న క్రయ విక్రయాలను క్షుణ్ణంగా పరిశీలించి అధ్యయనం చేసినట్లు ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సోయం మారుతి, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, కమిటీ డైరెక్టర్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంపీ డాక్టర్ అరెస్ట్

గుడిహత్నూర్ , మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పీఎంపీ డాక్టర్ సూర్య వంశీ దిలీప్‌ను అరెస్టు చేసినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ శనివారం తెలిపారు. గుడిహత్నూర్ మండలానికి చెందిన ఒక మహిళ ఐదునెలల గర్భవతిగా ఉన్నప్పుడు తన అర్హతకు మించి వైద్యం అందించి బాధితురాలిని అస్వస్థతకు గురికావడానికి కారణమైనందున అరెస్ట్ చేశామన్నారు. బాధితురాలికి గర్భం పోవడానికి కావల్సిన టాబ్లెట్‌ను చట్ట వ్యతిరేకంగా ఇచ్చినందున డాక్టర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు. జిల్లా వైద్య శాఖ వారు అందించిన సమాచారం మేరకు డాక్టర్‌కు అర్హత లేదని తెలిసిన వెంటనే కేసు నమోదు చేశామన్నారు.

రేపు వారాంతపు సంత వేలం

నేరడిగొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సంత వేలాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలంను నిర్వహిస్తున్నామన్నారు. అర్హులు పదివేల రూపాయలను దరావత్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు

నేరడిగొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. శనివారం పెట్రోలింగ్‌లో భాగంగా మండలంలోని బోథ్‌ఎక్స్‌రోడ్ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను తనిఖీ చేశామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి టాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'మా సమస్యలు ప్రస్తావించినందుకు ధన్యవాదాలు'

ఉట్నూర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని ఏళ్లుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న గెస్ట్‌లెక్చరర్ల సమస్యల పై శనివారం అసెంబ్లీలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ప్రస్తావించినందున ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీకాలేజ్ గెస్ట్‌లెక్చరర్లు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర నాయకులు సోగాల ప్రవీణ్,సయ్యద్‌జావిద్ అలీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలో డిగ్రీకాలేజీలో గెస్ట్‌లెక్చరర్ల కోసం ఇంటర్వ్యూలు ద్వారా ఎంపిక కావడం జరుగుతుందన్నారు. మాకు 12 నెలల వేతనం ఇవ్వడం లేదని రోజు వారి ఆధారంగా జీతం చెల్లించడం జరుగుతుందన్నారు. తమకు ప్రతి సంవత్సరం ఆటో రెన్యూవల్ చేసి, 12 నెలల జీతం చెల్లించాలని, ఇతర సమస్యల పై నియోజక వర్గ ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ను కలిసి విన్నవించడం జరిగిందన్నారు. శనివారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించారని ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

భూగర్భజలాలను పెంచాలి

● భూగర్భ జల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీవల్లి

సిరికొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నీరు ఒక సహజ సిద్ధమైన ప్రకృతి ప్రసాదించిన ఆస్తి. నీరు లేనిదే సమస్త జీవకోటికి మనుగడ లేదని జిల్లా భూగర్భ జల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీవల్లి తెలిపారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో శనివారం సిరికొండ గ్రామపంచాయతీ పరిధిలోని జాకీర్‌గూడ గ్రామంలో నీటి పొదుపు, భూగర్భ జలాలను పెంచడం, వృథానీటిని ఎలా అరికట్టాలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భూగర్భ జల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీవల్లి మాట్లాడుతూ...వర్షపు నీటిని ఒడిసిపట్టి ఆ నీటిని సక్రమంగా వినియోగించడం, తద్వారా భూగర్భ జలాలను పెంచడం, నీటి దుర్వినియోగాన్ని అరికట్టడం వంటివి ప్రతిఒక్కరూ చేయాలన్నారు. అనంతరం గ్రామస్తులకు నీటి కుండలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా భూగర్భ జల శాఖ సిబ్బంది పుల్లారావ్, భూమన్న, నర్సయ్య, జంగు బాపు, అనిల్, హరీష్, జాకీర్ గూడ పటేల్ కుమ్ర భీంరావ్, రాయిగూడ రాయిసెంటర్ సార్‌మేడి అమృత్ రావ్, ప్రజలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా భూగర్భ జల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

మందకృష్ణ మాదిగ పోరాటంతోనే వర్గీకరణ



మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

గుడిహత్నూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధించామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బడుగు గంగయ్య అన్నారు. శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ పోరులో అమరుల పోరాటం మూడు దశాబ్దాల పోరాటంతో వర్గీకరణ సాధించుకున్నామన్నారు. వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉపకులాల జీవితాల్లో వెలుగు నింపిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు సందూరి వినయ్, సాగర్, గుర్రాల ఆశన్న, దోమకొండ సుధాకర్, మల్యాల కరుణాకర్, బడుగు రాజేశ్వర్, దవుల భువనేశ్వర్ చిట్యాల గంగన్న, అంకుష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త హమాలీలు జైనథ్ మార్కెట్‌లో దరఖాస్తు చేసుకోవాలి

జైనథ్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): జైనథ్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని జైనథ్, బేల సబ్‌మార్కెట్‌లో శనగ కొనుగోళ్లకు సంబంధించి అర్హులైన హమాలీలు పనులు చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి టి.దేవన్నలు తెలిపారు. శనివారం జైనథ్ మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పాలకవర్గం నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలను చేశారు. జైనథ్‌లో వంద మంది హమాలీ లైసెన్సులు, బేలలో 50 మంది కొత్త హమాలీలు అవసరం ఉంటుందన్నారు. దరఖాస్తు ఫారానికి శారీరక సామర్థ్యానికి సంబంధించిన వివిధ ధృవపత్రాలను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ విలాస్‌రావ్, డైరెక్టర్‌లు ఎన్.స్వామియాదవ్, ఎస్‌కే మహిమూద్, బాసనంతోష్, తుడంరాములు, ఎన్.స్వామియాదవ్, ఎల్మారాంరెడ్డి, పెద్దబాయి, రామన్న, మడారిచంద్రకాంత్, బి.సూర్యకాంత్, నిమ్మల ప్రభాకర్‌లతో పాటు మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతాపూర్‌లో గిరిజనులకు ట్యాంకర్‌తో నీటి సరఫరా



ట్యాంకర్‌తో నీరు అందిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఉట్నూర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): శాంతాపూర్ గిరిజనుల మంచినీటి సమస్యను పరిష్కరించడానికి శనివారం పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ ద్వారా నీరు అందించారు. రెండు రోజుల కింద బోరుబావికి ఉన్న మోటారు చెడిపోవడంతో రెండు రోజులుగా తీవ్ర మంచినీటి ఎద్దడి ఎదుర్కొన్నారు. గిరిజనులు వాగు నీరు తాగి అనారోగ్య సమస్యల బారీన పడతారని గ్రహించిన పంచాయతీ సెక్రటరీ వినోద్ ట్యాంకర్ ద్వారా శనివారం మంచినీరు గిరిజనులకు సరఫరా చేయించారు. గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి బోరుమోటారు మరమ్మతులు చేపట్టాలని మాజీ సర్పంచ్ రాధా మారుతి కోరారు.

గర్భిణులకు నాణ్యమైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ సాధన

ఆదిలాబాద్ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : డయాగ్నోస్టిక్ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు నాణ్యమైన సేవలు అందించాలని, ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ సాధన పేర్కొన్నారు. ప్రత్యేక తనిఖీ బృందం సభ్యులు పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను పర్యవేక్షించి పలు సలహాలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించారు. తనిఖీ బృందం సభ్యులు డాక్టర్ క్రాంతి, మహిళా సాధికారత కో-ఆర్డినేటర్ యశోద, కానిస్టేబుల్ వైష్ణవి ఉన్నారు.

ఆకట్టుకున్న యువఉత్సవ్ పోటీలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ జానపద నృత్యాలు భారత కళలు ఉట్టిపడేలా జిల్లాస్థాయి యువ ఉత్సవ్ 2024 - 25 పోటీలు ఉత్సహంగా సాగాయి. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో భారత ప్రభుత్వ యువజన సర్వీస్, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం నేతృత్వంలో పోటీలు జరిగాయి.

నియోజకవర్గానికి భారీగా నిధులు



ఆడేగజేందర్‌ను సన్మానిస్తున్న లింగట్ల గ్రామస్తులు

నేరడిగొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి 12 కోట్ల నిధులు మంజూరు చేయించానని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండలంలోని కొర్టికల్ (బీ), కొర్టికల్(కే) లింగట్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధుల నుంచి 20 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులను ప్రారంభించారు. ఆయనకు గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ఈ ప్రజా ప్రభుత్వంలో మంత్రి సీతక్క సహాయంతో నియోజకవర్గానికి 12 కోట్ల రూపాయల నిధులు తెచ్చామని, నియోజకవర్గంలో ప్రతి గూడెంలో రోడ్లు వేసే బాధ్యత తీసుకుంటానని అన్నారు. మంత్రి సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన వెంట బోథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆడే వసంత్‌రావు, సీనియర్ నాయ కులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణ్‌సింగ్, బోథ్ నియోజకవర్గ యువజన అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కైలాష్ నానక్‌సింగ్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో మోటార్ దొంగతనం

తాంసి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో మోటార్ చోరీ అయింది. ఎవరైనా చనిపోతే అక్కడ స్నానాలు చేసేవారు. పశువులకు సైతం ఈ బోరు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. కాని గత నాలుగు ఐదురోజుల క్రితం ఇక్కడ ఉన్న బోరును ఎవరో దొంగిలించినట్లు పారిశుధ్య కార్మికులు పేర్కొంటున్నారు. శనివారం వెళ్లి చూడగా బోరు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఇది ఇలా ఉంటే ఇటీవల హస్నాపూర్ గ్రామ సమీపంలో సైతం ట్రాన్స్‌ఫార్మర్ వైర్లను దొంగిలించినట్లు ఆ గ్రామస్తులు పేర్కొన్నారు. తాంసి మండల కేంద్రానికి చెందిన రైతు గుండ రవి సోలార్‌ను కూడా దొంగిలించినట్లు పేర్కొన్నారు. పోలీసులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండ వాసులు కోరుతున్నారు.

గ్రూప్స్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు



అశోక్‌ను సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు

తాంసి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తాంసి గ్రామానికి చెందిన జానకొండ అశోక్‌కుమార్ వరుసగా ర్యాంకులు సాధిస్తూ అందరిని అబ్బురపరుస్తున్నాడు. వరుసగా గ్రూప్ వన్, గ్రూప్ టూ, గ్రూప్ త్రీ ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచాడు. రాష్ట్రస్థాయి ర్యాంకులు సంపాదించి శభాష్ అనిపించుకుంటున్నారు. తాంసికి చెందిన అశోక్ ప్రస్తుతం జైనథ్ మండలంలోని సుందరగిరిలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రూప్‌వన్ ఫలితాల్లో 399 మార్కులు సంపాదించి రాష్ట్రస్థాయిలో 458 ర్యాంకు సంపాధించాడు. గ్రూప్ 2లో 380 మార్కులు సంపాదించి రాష్ట్రస్థాయిలో 250వ ర్యాంకు పొందాడు. అలాగే గ్రూప్ 3లో 280 మార్కులు సంపాదించి రాష్ట్రస్థాయిలో 417వ ర్యాంకును సొంతం చేసుకున్నాడు. వరుసగా ర్యాంకులు సంపాదించడంతో ఆయనను పలువురు అభినందిస్తూ సన్మానిస్తున్నారు.



కాలి బూడిదైన గోధుమపంట

గోధుమపంట దహనం

రూ.30,000 నష్టం వాట్లిందని బాధిత రైతు ఆవేదన

భైంసా రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిద్ధూర్ గ్రామ శివారులో రైతు జాదవ్ మారుతి పాటిల్ పండించిన గోధుమ పంట కుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి నిప్పు పెట్టారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఈ ఘటనలో పూర్తిగా దగ్ధమైంది. పంటకు నిప్పు పెట్టడంతో సుమారు రూ.30,000ల మేరకు నష్టం వాట్లిందని బాధిత రైతు పేర్కొన్నారు. ఈ ఘటనపై తక్షణమే దర్యాప్తు చేసి బాధ్యతలను పట్టుకుని కఠినచర్యలు తీసుకోవాలని పోలీసులను కోరాడు. నష్టపరిహారం చెల్లించాలని రైతు అధికారులకు కోరారు.

అటల్ జీ ఆశయాలు భావితరాలకు ఆదర్శం కావాలి

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం పరిణీత

సోన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారీ వాజపేయి స్వపరిపాలన, ఆదర్శమైన వ్యక్తిత్వం, ఆయన ఆశయాలు భావితరాలకు ఆదర్శం కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం పరిణీత పేర్కొన్నారు. అటల్ జీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్మల్ జిల్లాలోని సోన్ గ్రామంలో పర్యటించారు. అటల్ జీతో గతంలో అనుబంధం ఉన్న సోన్ గ్రామానికి చెందిన ముత్యపల్లి నరేష్‌ని కలిసి సన్మానించారు. అటల్ బిహారీ వాజపేయితో కలిసిన అనుబంధంపై చర్చించారు. రాబోయే రోజుల్లో అటల్ జీ మ్యూజియం ఏర్పాటుకు బీజేపీ పార్టీ కృషి చేస్తుందన్నారు. యువత అటల్ బిహారీ వాజపేయి ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, బీజేపీ నాయకులు మేకల అశోక్, మామిడాల సంతోష్, గడ్డం నర్సయ్య, దాసరి శ్రీనివాస్, జక్క రాజేశ్వర్, నవీన్, రాములు, మక్కన్న, రాజు, రాకేష్, రమేష్, నవీన్, పత్తి రాజు, గంగాధర్, తదితరులు ఉన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

ముథోల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ సాధనకు కృషి చేసిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శనివారం ముథోల్‌లో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కన్వీనర్ మహేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సంఘం నాయకులు సాయిలు, బీజేపీ నాయకులు తాటివార్ రమేష్, సతీష్ రెడ్డి, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

మొరం రోడ్డుకు నిధులు మంజూరు

నర్సాపూర్(జి), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్లి(కే) గ్రామంలో పంట పొలాలకు వెళ్లడానికి మొరం రోడ్డుకు నిధులు మంజూరు అయ్యాయి. మాజీ శాసనసభ్యులు జి.విఠల్‌రెడ్డి నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో మంజూరు చేయించారు. అర్లి(కే) గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నిర్మల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ 5వ మహాసభలు

నిర్మల్ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : శనివారం టీఎన్జీవో భవనంలో నిర్మల్ జిల్లా 5వ మహా సభలు నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

'పది' పరీక్షా కేంద్రాలను సందర్శించిన రాష్ట్ర పరిశీలకుడు

నిర్మల్ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పది పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు టి.శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. నిర్మల్‌లోని రవి, ఈద్గామ్, విజయ, కస్బా, జుమ్మేరాత్‌పేట్ హైస్కూల్ కేంద్రాల్లో నిర్వహణ తీరు పరిశీలించారు. ఎలాంటి కాపీయింగ్ జరుగకుండా చూడాలని సూచించారు. సిబ్బంది ఐడీ కార్డులను ధరించాలని, మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని సూచించారు. ఇతరులకు ప్రవేశం కల్పించవద్దని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని తెలిపారు. పరీక్షల సహాయ కమిషనర్ పరమేశ్వర్ ఆయన వెంట ఉన్నారు.

తనిఖీ చేసిన జిల్లా విద్యా శాఖ అధికారి

భైంసా రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జడ్పీహెచ్ఎస్ తిమ్మాపూర్ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించారు. శనివారం రోజు ద్వితీయ భాష పరీక్ష నిర్వహించారు. అక్కడి సీఎస్, డీవోలకు పలు సూచనలు చేశారు. కాపీయింగ్ జరుగకుండా అందరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. పోలీసుస్టేషన్ నుండి సరైన సెట్ ప్రశ్నాపత్రాలను తీసుకోవాలని, అదేవిధంగా జాగ్రత్తగా జవాబు పత్రాలను పోస్ట్ ఆఫీస్‌లో సరైన విధంగా పోస్ట్ చేయలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షలో 9,116కు గాను 9,108 మంది హాజరయ్యారు. 8 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. పరీక్షల విద్యాశాఖ సమన్వయ కర్త లింబాద్రి, ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారి పాల్గొన్నారు.

దిలావర్‌పూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు శనివారం దిలావర్‌పూర్ పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. సీఎస్, డీవోలకు పలు సూచనలు చేశారు. కాపీయింగ్ జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ నుండి సరైన సెట్ ప్రశ్నాపత్రాలను తీసుకోవాలని, అదే విధంగా జాగ్రత్తగా జవాబు పత్రాలను పోస్ట్ ఆఫీస్‌లో జాగ్రత్తగా పోస్ట్ చేయాలని సూచించారు.

పదో తరగతి పరీక్షలకు 8 మంది గైర్హాజరు...

శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో 9,116కు గాను 9,108 మంది హాజరయ్యారు. 8 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖ పరీక్షల సమన్వయ కర్త, ముఖ్య పర్యవేక్షకులు లింబాద్రి తెలిపారు.

పది పరీక్షకు 99.91 శాతం విద్యార్థుల హాజరు

నిర్మల్ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షకు శనివారం 99.91 శాతం విద్యార్థులు హాజరైనట్లు డీఈవో రామారావు తెలిపారు. 8 మంది గైర్హాజరు కాగా బాలురు 4,445, బాలికలు 4,663 మంది హాజరయ్యారు. మొత్తం కేటాయించిన విద్యార్థుల సంఖ్య 9,116, ద్వితీయ భాష పరీక్ష నిర్వహించామని పేర్కొన్నారు.



వద్యాల్‌లోని పరీక్షల కేంద్రాన్ని సందర్శించిన రాధారాథోడ్

లక్ష్మణచాంద, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) రాధా రాథోడ్ వద్యాల్ గ్రామంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని శనివారం సందర్శించారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. వద్యాల్ కేంద్రంలో 168 విద్యార్థులకు గాను 168 మంది, లక్ష్మణచాందలో 174 మంది విద్యార్థులకు గాను 174 మంది హాజరై 100 శాతం పరీక్ష హాజరును నమోదు చేసినట్లు తెలిపారు.

తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేయటం లేదు

లక్ష్మణచాంద, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షం కారణంగా తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేయటం లేదని వద్యాల్ గ్రామానికి చెందిన రైతు కోండ్ర నర్సారెడ్డి శనివారం తన ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది ట్రాక్టర్ల మొక్కజొన్నలను మండుటెండలో ఎండబెట్టగా అకాల వర్షం పడి తడిసి పోయిందని దీంతో వ్యాపారులు కొనుగోలు చేయటం లేదని వాపోయారు. తడిసిందన్న సాకు చూపి దళారులు మద్దతు ధర కంటే తక్కువ ధర చెల్లించాలని చూస్తున్నారన్నారు. ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొందని నిట్టూర్చారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్నను కొనుగోలు చేయాలని కోరారు.



మొక్కజొన్న ఎండబెడుతున్న రైతు నర్సారెడ్డి దంపతులు

ఏప్రిల్ నుంచి బీడీ కార్మికులకు పెరిగిన కరువుభత్యం అమలు చేయాలి



టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న,

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికులకు పెరిగిన కరువుభత్యంను ఏప్రిల్ 1వ తేదీ నుండి అమలు చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో గల భగత్‌సింగ్ భవన్‌లో తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ కార్మికులకు ఏప్రిల్ 1వ తేదీ నుండి పెరిగి కరువు భత్యం వెంటనే అమలు చేయాలని బీడీ పరిశ్రమల యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. (వీడీఏ) కరువు భత్యం 104 పాయింట్లు పెరిగిందని, పాయింట్‌కు పది పైసల చొప్పున 10 రూపాయల 40 పైసలు, దీని ప్రకారం వేయి బీడీలకు మొత్తం కూలీ రేటు 261.97 పైసలు అలవుతుందన్నారు. నెలసరి ఉద్యోగులకు చాటన్, బట్టీ వాళ్లకు నెలకు రూ.312లు, బీడీప్యాకర్లకు రోజుకు 10 రూపాయల 40 పైసల చొప్పు పెరిగిందన్నారు. యాజమాన్యాలు అలసత్వం ప్రదర్శిస్తే కరువుభత్యం అమలు కోసం బీడీలు చుట్టే కార్మికులు, నెలసరి జీతాల ఉద్యోగులు, బీడీ ప్యాకర్లు ఆందోళనకు సిద్ధం కావాలని బీడీ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎం.బక్కన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రామలక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. గంగన్న, కోశాధికారి ఎండీ గఫూర్, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



మృతి చెందిన చుక్కల దుప్పిని పరిశీలిస్తున్న దృశ్యం

దస్తురాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆకొండపేట గ్రామంలోని పాతచెరువు దగ్గర ఊర కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందింది. అటుగా వెళ్తున్న అటవీ సిబ్బంది గమనించి వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారాన్ని అందించారు. ఘటన స్థలానికి అటవీ శాఖ, పశు వైద్య శాఖ అధికారులు చేరుకొని, అక్కడే పంచనామా నిర్వహించి దహనం చేశారు. ఇందులో ఎఫ్‌బీవో రవి, పశు వైద్యాధికారి సంధ్య, వెటర్నరీ అసిస్టెంట్ దేవిదాస్, అటవీ శాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అటవీ శాఖ అధికారులు ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు

● అసెంబ్లీలో ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్



దస్తురాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవునిగూడెం గ్రామంలో గ్రామస్థులకు అటవీశాఖ అధికారులకు ఇటీవలే వాగ్వాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఇదే విషయంపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శనివారం అసెంబ్లీలో మాట్లాడుతూ...మండలంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని, అటవీశాఖ మంత్రి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అటవీశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసి అభివృద్ధి సక్రమంగా జరగడానికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని ఇవ్వాలని కోరారు.

విద్యార్థుల ఆవిష్కరణల ప్రదర్శన



బాసర, మార్చి, 22 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో జరుగుతున్న టెక్ ఫెస్టివల్ (అంతఃప్రజ్ఞ) సందర్భంగా విద్యార్థుల ఆవిష్కరణలను శనివారం ప్రదర్శించారు. వివిధ విభాగాలు ఇంజనీరింగ్ విద్యార్థులు తమ ప్రయోగాలను ప్రయోగాత్మకంగా చేసి చూయించారు, సందర్శకులకు వివరించారు. ప్రొఫెసర్ గోవర్ధన్‌తో పాటు యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఆవిష్కరణలను సందర్శించి పరిశీలించారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

దిలావర్‌పూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో దిలావర్‌పూర్ మండల బీఆర్ఎస్ నేతలను శనివారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ అధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీలను పూర్తిగా మాఫీ చేయకుండా దగా చేశారన్నారు. మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ఇవ్వడం లేదని తీవ్రంగా మండిపడ్డారు. మాటిమాటికి నేతలను అరెస్ట్ చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.


బోథ్‌లోని వేదం పాఠశాల సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురికినీరు

ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మురికి నీరు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

బోథ్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేదం పాఠశాల ముందు మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. బస్టాండ్ ప్రాంతంలో నిర్మించిన పలు నివాస గృహాల నుంచి వ్యాపార సంస్థల నుంచి బయటకు వచ్చిన నీరు సరైన మురికి నీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో నీరంతా రోడ్డుపై ప్రవహిస్తుంది. ఫలితంగా ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురికి నీటిని దాటి వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఎదురుగా వాహనాలు వచ్చిన సమయంలో మురికి నీరు పక్కనున్న వారికి చిల్లుతుందని ప్రజలు వాపోతున్నారు. మురికి నీరు రోడ్డుపై ప్రవహించడంతో రోడ్డు సైతం గుంతలుగా మారుతుంది. ఆర్‌అండ్‌బి అధికారులు రోడ్డుపై పారే మురికి నీటిని రోడ్డుపై రాకుండా చూడాల్సిన అవసరం ఉంది. లేకుంటే రోడ్డు చెడిపోయే ఆస్కారం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

రోడ్డు పక్కనే మంటలు.. రాకపోకలకు ఇబ్బందులు


రోడ్డుపైనే వ్యర్థ పదార్థాలకు నిప్పు పెట్టిన దృశ్యం

తాంసి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే అంతర్రాష్ట్ర రహదారిపై చెత్తాచెదారానికి నిప్పు పెడుతున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తాంసి మండలంలోని పొన్నారి గ్రామ సమీపంలో ఉన్న జిన్నింగ్ ఫ్యాక్టరీలలో వెలువడే వ్యర్థ పదార్థాలను తీసుకు వచ్చి అంతర్రాష్ట్ర రహదారి పక్కన పడేస్తున్నారు. వెంటనే దానికి నిప్పు పెట్టుతుండడంతో భారీగా పొగలు రావడం రాకపోకలకు ఇబ్బందులు కలుగు తున్నాయి. అసలే ఎండాకాలం మండుతున్న ఎండలకు తోడు ఈ వ్యర్థ పదార్థాల దగడు తాకిడికి ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఈ పొగ వల్ల కనిపించకపోవడంతో ఈపాటికి పలు ప్రమాదాలు సంభవించినట్లు పేర్కొంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత జిన్నింగు యజమానులకు విన్నవించిన పట్టించు కోవడం లేదని పలువురు వాపోతున్నారు. తాజాగా శుక్రవారం సైతం ఇక్కడ రోడ్డు ప్రమాదం జరిగింది. జిల్లా స్థాయి అధికారులు స్పందించి ఈ విషయంలో చర్యలు తీసు కోవాలని అంతర్రాష్ట్ర రహదారిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా ముగిసిన అఖండ హరినామ సప్తాహ


ఇంద్రవెల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక హనుమాన్ ఆలయంలో ఏడు రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం శనివారం రోజు ఘనంగా ముగిసింది. ఈ అఖండ హరినామ సప్తాహ ఆధ్మాత్మిక కార్యక్రమంలో భాగంగా హనుమాన్ ఆలయంలో స్వామి వారికి కాఖడహారతితో పాటు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మహారాజ్ భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని పేర్కొన్నారు. దైవ నామస్మరణ చేస్తే భగవంతునికి ప్రీతి పాత్రులవుతారన్నారు. ప్రతీ ఒక్కరు సన్మార్గంలో నడవాలని సూచించారు. ప్రతి సంవత్సరం అఖండ హరినామ సప్తాహం నిర్వహించడం వల్ల ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావనలతో పాటు క్రమశిక్షణ, జీవన విధానంలో మార్పు వచ్చి, వ్యసనాలకు దూరంగా ఉండటానికి ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు.

నేడు కదిలి పాపహరేశ్వర స్వామికి సహస్ర లింగార్చన పూజ


శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామి

దిలావర్‌పూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీ మాతా అన్నపూర్ణ పాపహరేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం సహస్ర లింగార్చన పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో భూమయ్య తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పూజ కొనసాగుతుందన్నారు. ఈ పూజ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే భక్తులు ఉదయం తొమ్మిది గంటల లోపు రావాలని ఆయన కోరారు.


ప్రతీ విద్యార్థి చైల్డ్‌హెల్ప్ లైన్ సేవలు వినియోగించుకోవాలి

బోథ్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి హెల్ప్ లైన్ సేవలను వినియోగించుకోవాలని చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాలలో చైల్డ్ హెల్ప్ లైన్ సేవల గురించి వివరించడం జరిగింది. చిన్నారుల హక్కులకు ఎటువంటి భంగం కలిగిన 1098 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్ర మంలో సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. పిల్లల కు సామాజిక అంశాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషోర్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్

తెల్లకార్డు లబ్ధిదారులకు సర్కారు 'ఉగాది' కానుక

● రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు
● అక్రమ రవాణాకు అడ్డుకట్ట


ఓ రేషన్ దుకాణాంలో బియ్యం పంపిణీలో వేలిముద్ర వేస్తున్న లబ్ధిదారు (ఫైల్)


సన్న బియ్యం

భైంసా, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం పలుమార్లు పేర్కొన్నా ఆచరణలో అమలు కాలేదు. ఎట్టకేలకు బియ్యం పంపిణీకి ముహుర్తం ఖరారైంది. వచ్చే నెల నుంచి తెల్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఉగాది రోజున సీఎం రేవంత్ రెడ్డి సన్నబియ్యం పంపిణీని ప్రారంభనున్నట్లు తెలుస్తోంది. దీంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సంబంధిత వివరాలిలా ఉన్నాయి...

● అక్రమ రవాణాకు అడ్డుకట్ట

రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు ప్రారంభం నుంచి దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. కార్డులో పేర్కొన్న ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున అందిస్తున్నారు. వీటిని చాలా మంది లబ్ధిదారులు తినడం లేదన్నది బహిరంగ రహస్యమే. బియ్యాన్ని నేరుగా సమీప దుకాణాల్లో, ఇతర వ్యాపారులకు రూ. 15 నుంచి రూ. 18 చొప్పున విక్రయిస్తున్నారు. ముఖ్యంగా నిర్మల్ జిల్లా మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్నందునా లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ఎక్కువగా ధర్మబాద్, హిమాయత్‌నగర్, భోకర్, నాందేడ్ తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లుగా సమాచారం. అక్రమంగా తరలించిన బియ్యాన్ని మిల్లులకు తరలించి బియ్యాన్ని రిసైక్లింగ్ చేసి తిరిగి విక్రయస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఈ విషయమై ప్రభుత్వం అక్రమ దందాను నిలువరించాలనే కారణంగా రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లుగా తెలుస్తోంది. ఇక నుంచి ఈ అక్రమ బియ్యం దందాకు తెరపడినట్టేనని పలువురు భావిస్తున్నారు.

● ఉగాది నుంచి పంపిణీ

వచ్చే నెల నుంచి జిల్లాలో అన్ని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ఈ నెలాఖరులో ఉగాది పండుగ ఉండడంతో ఈ రోజునే అధికారికంగా సన్నబియ్యం పంపిణీ చేసేలా ప్లాన్ చేస్తున్నది ప్రభుత్వం. ఇప్పటికే సంబంధిత పౌర సరఫరాల శాఖ నుంచి వినియోగదారుల వివరాలను సేకరించింది. ఆ వివరాల ఆధారంగా ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేయనున్నది. దీంతో వినియోగదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నిర్మల్ జిల్లాలో వివరాలు

రేషన్ దుకాణాలు	: 412
రేషన్ కార్డులు	: 2,08,606
యూనిట్లు	: 6,30,242
బియ్యం	: 3,99,574 (కేటాయింపు మెట్రిక్ టన్నుల్లో)

పంట పొలాల్లో వంగిన విద్యుత్ స్తంభాలు

● పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు ● రైతులకు తప్పని ఇబ్బందులు


అర్లి (టి) శివారు ప్రాంతంలో వంగిన 11 కేవీ విద్యుత్ స్తంభం

బీంపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరి ష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తూ కొంత మంది అధికారుల నిర్లక్ష్యంతో వంగిన విద్యుత్ స్తంభాలతో రైతులకు ప్రమాదాలు తప్పడం లేదు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలో పంట పొలాల్లో వంగిన విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలిపోతాయో తెలియదు, ఎప్పుడు ఎవరికి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అర్థం కాని పరిస్థితి. విద్యుత్ స్తంభాలు వంగి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వివరాల్లోకి వెళితే మండలంలోని అర్లి (టి) శివారు ప్రాంతంలో సుంకరి దినకర్ అనే రైతు తన పొలంలో 11 కేవీ విద్యుత్ స్తంభాలు కుంగిపోయాయి. ఎప్పుడు కూలిపోతుందో తెలియదు. ఎవరికి ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదు, విద్యుత్ శాఖ అధికారులు మాత్రం తమకు ఏమి తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. అనుకోకుండా జరగ రానిది జరిగితే అందుకు బాధ్యులు ఎవరూ ఈ ప్రాంతంలో రైతుల పొలాల నుంచి వేసిన ఈ విద్యుత్ స్తంభాల కింద నుంచే రైతులు పొలం పనులు చేసుకుంటాడు. పొలంలో అరక విద్యుత్ స్తంభం కింద నుంచి వెళ్లాలంటే భయాందోళనకు గురవుతు న్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వంగిన 11 కేవీ విద్యుత్ స్తంభాలను సరిచేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

అష్ట భుజ వేణుగోపాల స్వామిపై సూర్య కిరణాలు


అష్టభుజ వేణుగోపాల స్వామి విగ్రహంపై పడిన సూర్యకిరణాలు

లక్ష్మణచాంద, మార్చి 32 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆలయంలో గల అష్ట భుజ వేణుగోపాల స్వామి విగ్రహంపైన శనివారం ఉదయం 6 గంటల 40 నిమిషాల సమ యంలో సూర్య కిరణాలు పడ్డాయి. చాలా అరుదుగా జరిగే ఈ దృశ్యం ప్రతీ సంవత్సరం అక్టోబరు, మార్చి నెలలో రెండు సార్లు సంభవిస్తుందని ఆలయ పూజారి రమేష్ చారి తెలిపారు.

రుణమాఫీ కాక.. రైతులు చనిపోతున్నా పట్టించుకోరా!?

● చర్చా వేదికలో రైతుల ఆందోళన ● మౌలిక వసతులు కరువు


తలమడుగు మండల కేంద్రంలో నిర్వహించిన బహిరంగ చర్చా వేదికలో అధికారులను నిలదీస్తున్న లబ్ధిదారులు, రైతులు


సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

తలమడుగు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చినా రెండు లక్షల రుణమాఫీ కాక పోవడంతో రైతులు ఆత్మహత్య చేసుకొని మృతి చెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని శనివారం తలమడుగు మండల కేంద్రంలో నిర్వహించిన బహిరంగ చర్చా వేదికలో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాల అందరి లబ్ధిదారులు వాటి వివరాలను పరిష్కరించేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద మండల కేంద్రంలో రెండో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కానీ. బహిరంగ చర్చా వేదిక. ఎందుకు నిర్వహిస్తున్నారన్నారు. రైతులకు 90 వేల రుణమాఫీ కూడా ఇప్పటివరకు కాలేదన్నారు. తలమడుగు మండలంలో వందలాది మంది రైతులకు రుణమాఫీ కాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి అన్నారు. సమస్యలు పరిష్కారం కోసం అధికారులకు విన్నవించిన ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. కొంతమంది లబ్ధిదారులకు గ్యాస్ డబ్బులు రావడం లేదని ఫిర్యాదు చేస్తే ట్రెజరీలో డబ్బులు లేవని అధికారులు చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించే అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరారు. అదేవిధంగా మంజులైన లబ్ధిదారులకు. డబుల్ బెడ్ రూములు. వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాగా సమస్యలు పరిష్కరించలేని బహిరంగడు చర్చా వేదిక ఎందుకని అధికారులను స్వచ్ఛంద సంస్థ సభ్యులను లబ్ధిదారులు నిలదీశారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి మాట్లా డుతూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం బహిరంగ చర్చా వేదికను నిర్వహిస్తున్నదని ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇ చ్చారు. ఇందులో తహసీల్దార్ రాజమోహన్ ఎంపీడీవో చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి, ఎంపీఈవో వినోద్, కిసాన్ మిత్ర కోఆర్డినేటర్ పంచాయతఈ సెక్రటరీలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

● మౌలిక వసతులు లేక ఇబ్బందులు

మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన బహిరంగ చర్చా వేదికలో కనీస మౌలిక వసతులు. అధికారులు కల్పించకపోవడంతో దూరప్రాంతాలనుంచి వచ్చిన లబ్ధిదారులు ఆయా శాఖల అధికారులు ఇబ్బందులు పడ్డారు. మండుతున్న ఎండలో తాగునీరు భోజన వసతి. ఇతర మౌలిక వసతులు కల్పించకపోవడంతో అధికార తీరుపై పలు విమర్శలు పలువురు వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎంపీడీవోను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఎలాంటి లాంటి నిధులు రాలేదని. ఉన్న వాటితోనే సర్దుబాటు చేశామన్నారు.

వారం పనిచేస్తే రూ.300 వస్తున్నాయి

● ఉపాధి హామీ కూలీల ఆందోళన
● సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు


ఆందోళన చేస్తున్న కూలీలు

తలమడుగు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టి పనులు లేని కూలీలకు పనులు కల్పించి ప్రతీ రోజు వారికి కనీసం రూ.300 కూలి లభించేలా పథకాన్ని ప్రారంభించిన ప్పటికీ కొంతమంది అధికారుల నిర్లక్ష్యంతో పనిచేసే కూలీలకు సక్రమంగా డబ్బులు రావడం లేదని వారానికి కనీసం 300 రూపాయలే వస్తున్నాయని కూలీలు ఆందోళన చేపట్టారు. అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం దేగమ గ్రామానికి చెందిన 90 మంది జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలు ఆందోళన చేపట్టారు. దేగామ గ్రామ సమీపంలో పనులు జరుగుతున్న ప్రదేశంలో ఆందోళన చేపట్టి అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మూడు వారాల నుంచి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు పనులకు వెళ్తున్నప్పటికీ టెక్నికల్ అసిస్టెంట్ కొలతలు సక్రమంగా చెయ్యకపోవడంతో వారం రోజులు పనిచేసిన కొంతమందికి 300 నుంచి 500 వరకే డబ్బులు వస్తున్నాయన్నారు. ప్రతిరోజు 300 డబ్బులు రా వాల్సింది ఉండగా వారానికి రావడంతో పనికి రావాలంటేనే ఇబ్బందిగా ఉందన్నా రు. సంబంధిత అధికారులు పనులు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించి ఏ రోజు కు ఆ రోజు కొలతలు చేసి మాస్టర్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా మూ డు వారాలైన పనులు జరుగుతున్న ప్రదేశానికి రావడం లేదన్నారు. వచ్చినా కూ డా చుట్టం చూపుల వచ్చి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. బయ ట కూలీలకు వెళ్తే రోజు 300 నుంచి 400 వరకు కూలి డబ్బులు వస్తున్నాయి. కానీ ఉపాధి పథకంలో రోజుకు 50 నుంచి వంద రూపాయలే వస్తున్నాయని ఇలా చేస్తే గ్రామంలో గల 90 మంది కూలీలు పనులు మానేస్తామని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రానికి వచ్చి ఈజీఎస్ ఏపీవో మేఘమాల, ఈసీ ప్రవీణ్ రావుకు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించకుంటే ముక్కుమూడిగా ఉపాధి హామీ పనులను మానేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంట్లో స్పందించిన అధికారులు సోమవారం గ్రామానికి వచ్చి సమస్యలు పరిష్కరించి పనికి తగ్గ వేతనం అదేవిధంగా చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చారు. అనంతరం కూలీలు గ్రామానికి తిరిగి వెళ్లి పోయారు.


అధికారులకు ఫిర్యాదు చేస్తున్న దేగామా కూలీలు

కాలుతున్న వ్యర్థాలతో కలుషితం కానున్న తాగునీరు

● నిరుపయోగంగా పొడి చెత్త, తడి చెత్త షెడ్లు


బోథ్ సమీపంలో పంచాయతీ వారు సేకరించిన చెత్తను కాల్చివేస్తున్న దృశ్యం

బోథ్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాల్లో పంచాయతీ వారు సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చేందుకు గత ప్రభుత్వ హయాంలో పొడి, తడి చెత్త షెడ్లను నిర్మించారు. అయితే వాటిని వినియోగించడంలో గ్రామ పంచాయతీల వారు నిర్లక్ష్యం చేస్తున్నారు. మరోవైపు సేకరించిన చెత్త ఎక్కువగా ఉండడం షెడ్లలో స్థలం అవసరం మేరకు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో చెత్తను బయట వేసి దగ్ధం చేయాల్సిన అవసరం ఏర్పడుతుందని పంచాయతీల వారు అంటున్నారు.

● నీటి వాయు కాలుష్యం

సేకరించిన చెత్తను గ్రామాల సమీపంలో వేసి దగ్ధం చేస్తూ ఉండడంతో నీటి కాలుష్యంతో పాటు వాతావరణ కాలుష్యం ఏర్ప డుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు సేకరించిన చెత్తను దగ్ధం చేయడం వల్ల పొగ వల్ల వాతావరణం కాలుష్యం ఏర్ప డుతున్నది అంతేగాక భూమిపై వేసిన చెత్తను కాలుస్తున్న సమయం లో ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలోకి వెళ్లే ఆస్కారం ఉందని ఫలితంగా నీటి కాలుష్యం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని పలువురు అంటు న్నారు.

● సరిపోని డంపింగ్ యార్డులు

చిన్న చిన్న గ్రామాలలో చెత్త వేసేందుకు డంపింగ్ యార్డులు సరిపోతున్నా పెద్ద గ్రామపంచాయతీలలో మాత్రం డంపింగ్ యార్డులో సరిపోవడం లేదు. మరోవైపు షెడ్లలో ఏర్పాటు చేసిన గదులలో పొడి, తడి చెత్తను వేరుగా వేసేందుకు స్థలం లేకపోవడంతో బయట డంపింగ్ యార్డులను తప్పనిసరి పరిస్థితుల్లో ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుంది. దీంతో డంపింగ్ యార్డు దహనం ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లేదిగా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

● వర్షాకాలం మరింత కంపు

వర్షాకాలంలో డంపింగ్ యార్డు సమీపంలో దుర్గంధం వస్తుందని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. అనేక గ్రామాల్లో, గ్రామాల సమీపంలోని డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి దగ్ధం చేస్తున్నారు. దీంతో వర్షాకాలం సమయంలో తీవ్రమైన దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. మరోవైపు భారీ వర్షాల వల్ల డంపింగ్ యార్డు నుండి కొట్టుకుపోయిన చెత్త సమీపంలోని వాగులను కలుషితం చేస్తుంది. ఏదేమైనా డంపింగ్ యార్డులు వాయు, నీటి కాలుష్యానికి కారణాలు అవుతున్నాయి.



పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి





- జిల్లాలోని మున్సిపాలిటీ, గ్రామ పంచాయ తీల్లో జోరుగా ఆస్తి పన్ను వసూళ్లు
- ఎల్‌ఆర్‌ఎస్‌పై పెద్ద ఎత్తున ప్రచారం
- అయినా ఆశించిన రీతిలో స్పందన కరువు

నిర్మల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలన్నీ ఎల్‌ఆర్‌ఎస్, ఆస్థి పన్ను, ఇతర అన్ని రకాల పన్నుల వసూళ్లపై సీరియస్‌గా దృష్టి సారిస్తూ ఆదాయం పెంపు కోసం తంటాలు పడుతున్నాయి. అయితే మున్సిపాలిటీ, పంచాయతీల్లో ఆస్థిపన్ను లక్ష్యానికి కొంత చేరువవుతున్నప్పటికీ ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో మాత్రం పెద్దగా దరఖాస్తుదారుల నుంచి స్పందన కనిపించకపోతుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎల్‌ఆర్‌ఎస్ కోసం మున్సిపాలిటీలు పెద్దఎత్తున ప్రచారాన్ని కొనసాగిస్తున్నప్పటికీ దరఖాస్తుదారులు మాత్రం ఆ దిశగా దృష్టి సారించడం లేదు. ప్రభుత్వం ఈ నెలాఖరులోగా ఎల్‌ఆర్‌ఎస్ చేసుకున్న వారికి 25 శాతం డిస్కౌంట్ చెల్లించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటూ గత 20 రోజుల నుంచి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. సెల్‌ఫోన్‌ల ద్వారా ఫ్లెక్సీబ్యానర్‌ల ద్వారా, లోకల్‌ఛానల్స్‌ల్లోనూ ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే పనిలో పనిగా ఆస్థిపన్ను, ట్రేడ్ లైసెన్సుతో పాటు ఇతర అన్ని రకాల పన్నులు వసూళ్లను పకడ్బందీగా చేపట్టి మున్సిపాలిటీల ఆదాయాన్ని పెంచాలని చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలతో పాటు 396 గ్రామ పంచాయతీల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది అంతా ఆదాయ అన్వేషణలోనే నిమగ్నమై క్షేత్రస్థాయిలోనే ఎక్కువగా గడువుపుతున్నారు. దీంతో మున్సిపాలిటీలు, పంచాయతీ కా ర్యాలయాల్లో సిబ్బంది కనిపించక వెలవెలబోతున్నాయి.



ఎల్‌ఆర్‌ఎస్‌పైనే ప్రధాన దృష్టి

అయితే జిల్లాలో అధికారులంతా ఎల్‌ఆర్‌ఎస్‌పైనే దృష్టి సారిస్తున్నారు. జిల్లాలోని 396 గ్రామ పంచాయతీలకు గానూ తమ ప్లాట్‌లను ఎల్‌ఆర్‌ఎస్ చేసుకునేందుకు 178034 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల లెక్కల ప్రకారం పంచాయతీలకు రూ.3,84 కోట్ల ఆధాయం రావాల్సి ఉంది. ఈ 17034 మంది దరఖాస్తుదారులను అధికారులు అప్రమత్తం చేస్తూ ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవాల్సిందిగా కోరుతున్నారు. ఫోన్ మేసేజ్‌లతో పాటు నేరుగా ఫోన్‌లు చేస్తూ కూడా ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇలా 20 రోజులు గడిచినప్పటికీ ఇప్పటి వరకు కేవలం 378 మంది దరఖాస్తులకు గానూ 37లక్షల చెల్లింపులు మాత్రమే జరిగాయి. కాగా 14వేల మంది దరఖాస్తుదారులు గ్రామీణ ప్రాంతాల్లో ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవాల్సి ఉంది. గడువు సమీపిస్తున్నప్పటికి పెద్దగా స్పందన కనిపించకపోతుండడంతో అధికారులు తమ చర్యలను మరింత వేగంగా చేస్తున్నారు. కాగా జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో కూడా ఎల్‌ఆర్‌ఎస్ తీరు నత్తనడకన సాగుతోంది. నిర్మల్ మున్సిపాలిటీలో మొత్తం 15,515 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 300 దరఖాస్తులకు సంబంధించి మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ జరిగాయి. వీటి ద్వారా నిర్మల్ మున్సిపాలిటీకి రూ. 1.10 కోట్ల చెల్లింపులు ఇప్పటి వరకు జరిగాయి. భైంసా మున్సిపాలిటీలో 9044 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు కేవలం 40 దరఖాస్తులకు సంబంధించి మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ అయ్యాయి. దీని ద్వారా రూ.15 లక్షల ఆదాయం మాత్రమే సమకూరింది. ఖానాపూర్ మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 1928 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు కేవలం 27 మంది మాత్రమే క్రమబద్దీకరించుకోవడంతో కేవలం 8లక్షల ఆదాయం సమకూరింది.

ఆస్థి పన్నుపై ఫోకస్...

కాగా ముఖ్యంగా గ్రామ పంచాయతీల్లో ఆస్థిపన్ను డ్రైవ్ వేగంగా కొనసాగుతోంది. జిల్లాలో మొత్తం 396 గ్రామ పంచాయతీలకు సంబంధించి 10కోట్ల 43 లక్షల 44 వేల 522 రూపాయలు పన్నులరూపంలో గ్రామ పంచాయతీలకు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు 9కోట్ల60లక్షల22వేల163 రూపాయలను పన్నుల రూపం లో వసూలు చేశారు. ఇంకా జిల్లాలో 83 లక్షల 22 వేల 358 రూపాయలు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఈ మొత్తం నుంచి 45లక్షల రూపాయల విలువ గల ఆస్థులకు సంబంధించి అవన్ని శిధిలావస్థలో ఉన్నాయి. ఈ లెక్క ప్రకారం మరో 45లక్షల రూపాయల వరకే పన్ను వసూలు చేయాల్సి ఉందంటున్నారు. కాగా ఆస్థి పన్ను వసూల్‌లో ప్రస్తుతం జిల్లా రాష్ట్రస్థాయిలోనే తొమ్మిదవ ర్యాంకులో ఉండడం విశేషంగా చెబుతున్నారు.

మరో తొమ్మిది రోజులే గడువు

కాగా ఇటు ఆస్థి పన్ను వసూలుకు, ఎల్‌ఆర్‌ఎస్‌కు కేవలం తొమ్మిది రోజుల గడువు మాత్రమే ఉండడంతో ప్రస్తుతం మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులంతా ఇటు ఎల్‌ఆర్‌ఎస్ అటు ఆస్థి పన్ను వసూళ్ల కోసం చర్యలను వేగవంతం చేస్తున్నారు. ఓ వైపు విస్తృతంగా ప్రచారం చేస్తూనే మరో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎల్‌ఆర్‌ఎస్‌ను చేసుకోవాలంటూ కోరుతున్నారు. అలాగే ఆస్థిపన్ను విషయంలో కూడా వెంటనే చెల్లింపులు జరిగేందు కోసం ఇంటింటికీ తిరుగుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మున్సిపల్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది వీధులకే పరిమితమవుతూ పన్నుల వసూళ్ల కోసం తంటాలు పడుతున్నారు. ఎనిమిది రోజుల్లోగా 25 శాతం రాయితీతో ఎల్‌ఆర్‌ఎస్‌ను చేసుకోవాలని దరఖాస్తుదారులను కోరుతున్నారు. అలాగే ఆస్థిపన్ను విషయంలో కూడా పెనాల్టీ లేకుండా చెల్లించుకునే వెసులుబాటు ఉన్న కారణంగా ఈ దిశగా స్పందించాలని బకాయిదారులను కోరుతున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ అంశంపై పలుచోట్ల ఫ్లెక్సీ హోర్డింగులు పెట్టి ప్రచారం చేస్తున్నారు.

టెలిఫోన్ ద్వారా ప్రజావాణి నిర్వహణ : కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వేసవి అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం టెలిఫోన్ ద్వారా నిర్వహించనున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో దూర ప్రాంత ప్రజల సౌకర్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 24 సోమవారం నుంచి ప్రతీవారం ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు టెలిఫోన్ ద్వారా ప్రజావాణి ఉంటుందన్నారు. ప్రజలు తమ సమస్యలను 9100577132 నెంబర్లకు సంప్రదించి దరఖాస్తులను వాట్సాప్ ద్వారా పంపవచ్చునని తెలిపారు. స్వీకరించిన దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. యధావిధిగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. ఈ సౌకర్యం దూర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

కోర్టు ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన దృశ్యం

నిర్మల్ అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవా సంస్థ సెక్రటరీ జి.రాధిక మాట్లాడుతూ... దూర ప్రాంతం నుంచి వచ్చే కక్షిదారులకు వేసవితాపం నుంచి ఉపశమనం లభిస్తుదన్నారు. అలాగే ఈ వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చడానికి జనాలు రద్దీగా ఉండే చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కే.అంజుకుమార్ రెడ్డి, ప్యానల్ లాయర్లు, డిఫెన్స్ కౌన్సిల్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకు రాములోరి తలంబ్రాల చేరవేత



తలంబ్రాల రసీదు అందజేస్తున్న డీఎం

నిర్మల్ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ భక్తుల ఇళ్ల వద్దకే చేరవేసే కార్యక్రమం చేపట్టిందని నిర్మల్ డీఎం పండరి తెలిపారు. ఏప్రిల్ 6న సీతారామ కల్యా ణం జరుగనుందని రూ. 151 చెల్లిస్తే ఆర్టీసీ కార్గో ద్వారా తలంబ్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శనివారం పలువురు భక్తులకు తలంబ్రాల రసీదులు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఎస్ఎం ఏఆర్‌రెడ్డి, కార్గో నిర్వాహకుడు కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

సారా ఫాతిమాకు పీహెచ్‌డీ పురస్కారం



పీహెచ్‌డీ సాధించిన సారా ఫాతిమా

నిర్మల్ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని పంచశీల కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఉర్దూ విభాగం సీనియర్ ఫ్యాకల్టీగా పని చేస్తున్న సారా ఫాతిమాకు పీహెచ్‌డీ డిగ్రీ పురస్కారం లభించింది. భోపాల్‌లోని మానస సరోవర్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. కాలేజీ యాజమాన్యం, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఐకే రెడ్డి

నిర్మల్ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యం కారణాలతో మృతి చెందిన కే. మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులను శాంతినగర్‌లో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. శనివారం వారి నివాసానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. కుటుంబానికి సంతాపం తెలిపారు. నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, పాకాల రాంచందర్, రమణారెడ్డి, వినయ్, దేవేందర్‌రెడ్డి, సరోత్తం రెడ్డి, తదితరులున్నారు.

26న మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

నిర్మల్ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికులు ఈ నెల 26న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే నిరసన ధర్నాలో పాల్గొనున్నారని ఆ సంఘం నాయకులు తెలిపారు. శనివారం డీఈవో కార్యాలయంలో సమాచారాన్ని అందజేశారు. ప్రభుత్వమే కోడి గుడ్లను సరఫరా చేయాలని, మెనూ చార్జీల పెంపు, పది వేల వేతన చెల్లింపు తదితర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు భూక్యా రమేష్, చిట్యాల లక్ష్మీ, మేనవ్వ పాల్గొన్నారు.

రైతు సంఘ రాష్ట్రసభలను జయప్రదం చేయండి

నిర్మల్ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 25 నుండి మూడు రోజుల పాటు నిజామాబాద్‌లో నిర్వహించే రైతు సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ... రైతు కూలీ, కౌలు రైతులకు ప్రభుత్వం రైతు భరోసా చెల్లించడం లేదన్నారు. రైతు బీమా అందడం లేదని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సబ్సిడీపై విత్తనాలు, యంత్రాలు అందజేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ సమస్యలపై వినతి పత్రం అందజేత

నిర్మల్ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం సీడీపీవోకు ఆ సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రతి నెల 5లోగా జీతాల చెల్లింపు, పదవి విరమణ చేసిన వారికి రెండు లక్షలతో పాటు పెన్షన్ చెల్లింపు, వేతనం రూ. 18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ప్రజలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలి

అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్



సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఏప్రిల్ 1 నుండి ప్రజలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రేషన్ దుకాణాలలో సన్న బియ్యం సరఫరా అంశంపై రేషన్‌డీలర్లు, రెవెన్యూ అధికారులతో ఆయన శనివారం తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... రేషన్‌కార్డు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలన్నారు. ప్రజలెవరికీ ఎట్టి పరిస్థితుల్లోను దొడ్డు బియ్యాన్ని ఇవ్వవద్దన్నారు. సన్నబియ్యం జారీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు. వేసవికాలం ఎండలు అధికంగా ఉన్నందున రేషన్ దుకాణాలకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎండ నుంచి రక్షణ కల్పించేలా తగిన ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ డీఎం వేణుగోపాల్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, రేషన్‌డీలర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా పాఠశాల స్థాయి నుంచి సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్

విద్యార్థులంతా పాఠశాల స్థాయి నుంచి సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాలశక్తి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సందర్శనకు వచ్చిన నిర్మల్ కేజీబీవీ విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు జిల్లాలో ప్రత్యేకంగా బాలశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. విద్యార్థులకు కలెక్టర్ కార్యాలయ పనితీరు, రెవెన్యూ అంశాలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులంతా చరిత్ర, రాజ్యాంగం, జనరల్ నాలెడ్జ్‌పై పట్టు సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగాలను సులభంగా సాధించవచ్చునన్నారు. పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు సమీకృత జిల్లా కార్యాలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సలోమి కరుణ, డాక్టర్ శ్రీనివాస్, కేజీబీవీ విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా

భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న జిల్లా భూగర్భ జల శాఖ అధికారి పి. శ్రీనివాస్‌బాబు

కడెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో మార్చి 22 అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా మండల రైతులకు, మహిళ సమాఖ్య సభ్యులకు నీటి పొదుపు, నిత్య జీవితంలో నీటి ప్రాముఖ్యత, ఇంకుడు గుంతలు, తదితర అంశాలపై భూగర్భ జల శాఖ అధికారులు అవల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా భూగర్భ జల శాఖ అధికారి పి. శ్రీనివాస్ బాబు మాట్లాడుతూ... నీరు లేకుంటే మానవ మనుగడ సాధ్యం కాదని, మనుషులకే కాకుండా జీవులన్నింటికి నీరు చాలా అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా నీటిని వృధా చేయకుండా పొదుపు చేయాలన్నారు. ఎన్నో దేశాలు నీరు దొరకక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, నీటిని పొదుపు చేయడం ద్వారా భావితరాలకు నీటిని అందించిన వారమవుతామని తెలిపారు. అనంతరం డీఆర్డీవో విజయలక్ష్మి మాట్లాడుతూ... ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీరు, నిత్యవరాలకు వినియోగించిన నీరు ఇంకుడు గుంతలలో ఇంకి భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. ఆదర్శ రైతులు మల్లేష్, రాజమల్లు, బైరి గంగరాజులను అధికారులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, మండల వ్యవసాయ అధికారి దినేష్, ఉద్యానవన అధికారి స్పందన, ఈజీఎస్ హెచ్‌ఆర్ సుధాకర్, మిషన్ భగీరథ ఏఈఈ అభిలాష్, నీటి పారుదల ఏఈఈ విశాల్, మండల పంచాయతీ రాజ్ అధికారి రాజ్, రైతులు, మహిళా సమాఖ్యా సంఘ సభ్యులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల నమూనా ప్రదర్శనకు ప్రథమస్థానం



నిర్మల్ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రమాదాల సమయంలో అర్ట్ చేస్తూ రూపొందించిన నమూనాకు ప్రథమ బహుమతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా విజ్ఞాన ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రజలు ప్రయాణిస్తున్న సమయంలో వాహనాలకు ప్రమాదం సంభవిస్తే తక్షణ సహాయానికి పోలీసుశాఖ, ఇతర సహాయ సంస్థలకు, బంధువులకు సమాచారం అందించే నమూనా విద్యార్థులు రూపొందించారు. ఆటోమేటిక్‌గా ప్రమాద స్థలం, సమయం, వాహనచోదకుల ఇతర పరిస్థితులు తెలియజేస్తుంది. తక్షణ వైద్య సహాయం అందించి ప్రాణాపాయం నుండి కాపాడేందుకు ఉపయోగపడుతుందని విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రమేష్, విద్యుత్ విభాగాధిపతి పొలాస స్వాతి విద్యార్థులను అభినందించారు. హైదరాబాద్‌లో నిర్వహించే మెరిట్‌డే సందర్భంగా సాంకేతిక శాఖ కమిషనర్ నుంచి విద్యార్థులు 25 వేల బహుమతి అందుకోనున్నారని తెలిపారు.

వాహన తనిఖీలు చేసిన మహిళా పోలీసులు



తల్వేద వద్ద డ్రంగ్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు

నిర్మల్ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా మండలంలోని తల్వేద గ్రామ ప్రధాన రహదారిపై శనివారం మహిళా కానిస్టేబుళ్లు రజిత, ప్రవళిక వాహనాల తనిఖీ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు మహిళా కానిస్టేబుళ్ల డ్రంగ్ అండ్ డ్రైవ్, ఈ చాలన్స్ విధించినట్లు తెలిపారు. మహిళలు తక్కువ కాకుండా ఎలాంటి డ్యూటీ అయిన మగవారితో సమానంగా చేస్తున్నారని తెలిపారు.

వాహనాల తనిఖీ నిర్వహించిన మహిళా పోలీసులు



వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న మహిళా పోలీసులు

నర్సాపూర్(జి), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్(జి) పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్ల మమత, విజయలక్ష్మిలు శనివారం విధుల్లో భాగంగా మండల పరిధిలో గస్తీ తిరుగుతూ వెహికల్ చెకింగ్, 100 డయల్ కాల్స్‌పై మగవారితో సమానంగా విధులు నిర్వహించారు.

వాహనాల తనిఖీ



ముథోల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని భైంసా - బాసర రహదారిపై శనివారం ముథోల్ ట్రైనీ ఎస్సై శ్రావణి ఆధ్వర్యంలో పోలీ సులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. వాహనదారులు సంబంధిత వాహన పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచిం చారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని తనిఖీ చేసే వదిలిపెట్టారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబం ధనలను పాటిస్తూ సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కుంటాల, మార్చి, 22 : (ఆంధ్రజ్యోతి) : మహిళలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కుంటాల పోలీసు సిబ్బంది సూచించారు. శనివారం కుంటాల మహిళా పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక అర్లి ఎక్స్ రోడ్డు వద్ద మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలకు ఇటీవల పలువురు పలు రకాల మాయ మాటలు చెప్పి మోసాలకు గురిచేస్తున్నారని, మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు ఒంటరిగా వెళ్లిన సమయంలో మెడలో ఉన్న చైను కనిపించకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఏదైనా అత్యవసర సమయంలో పోలీసుల సహకారం ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుంటాల పోలీసు సిబ్బంది సవిత, తదితరులు ఉన్నారు.